ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి

ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 214 | పేజీలు: 5 | వెల: రూ.3/- | బుధవారం 11 నవంబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



పరస్పర అంగీకారంతో

విడిపోతున్నాం

పవన్‌కల్యాణ్, అన్నా లెజినోవా

హైదరాబాద్, నవంబర్ 10 (ప్రభాత ఉదయం)

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆయన సతీమణి అన్నా లెజినోవా తమ వివాహ బంధానికి ముగింపు పలికారు. ఈ మేరకు ఇరువురు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. తమ జీవితంలో ఓ ముఖ్యమైన భాగాన్ని కలిసి పంచుకున్న తర్వాత పరస్పర అవగాహన, గౌరవంతో విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. వివాహ బంధం ముగిసినప్పటికీ మంచి స్నేహితులుగా, తమ పిల్లలకు అంకితభావంగల తల్లిదండ్రులుగా కొనసాగుతామని పేర్కొన్నారు. పిల్లల సంతోషం, శ్రేయస్సు ఎప్పటికీ తమ మొదటి ప్రాధాన్యతగా ఉంటాయని స్పష్టంచేశారు. తమ వ్యక్తిగత జీవితంలో మార్పు జరుగుతున్న సమయంలో ఈ విషయాన్ని అందరూ అర్థం చేసుకుని గోప్యతకు గౌరవం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రయాణంలో వెన్నంటి నిలిచిన ప్రతి ఒక్కరికీ ఇరువురు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. జనసేన పార్టీ మీడియా విభాగం ద్వారా ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. 2013లో రష్యాకు చెందిన అన్నా లెజినోవాను పవన్ వివాహం చేసుకున్నారు. కొన్ని రోజులుగా విడివిడిగా ఉంటున్నవారు పరస్పర అంగీకారంతో ఫ్యామిలీ కోర్టు ద్వారా విడాకులు పొందారు.

ఏ హోదాకు వెళ్లినా

మన గతాన్ని మర్చిపోవద్దు

నూతన డీఎస్పీలతో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 10 (ప్రభాత ఉదయం)

ఏ హోదాకు వెళ్లినా మన గతాన్ని మరిచిపోవద్దని నూతన డీఎస్పీలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మనం వచ్చిన నేపథ్యం మరిచిపోతే మన హోదాకు న్యాయం చేయలేమన్నారు. రాష్ట్ర భవిష్యత్తును రాబోయే 30 ఏళ్లు ఎలా నడిపించాలో నూతన డీఎస్పీల చేతుల్లోనే ఉందన్నారు. అధికారుల నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారతాయని పేర్కొన్నారు. పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 112 మంది డీఎస్పీలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, భద్రత సలహాదారు శివధర్ రెడ్డి, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పది మంది డీఎస్పీలు అరాచకంగా వ్యవహరించినా రాష్ట్రంలో సరైన పరిపాలన లేదనే ఆరోపణలు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆ సందర్భంలోనే శాంతి భద్రతలు క్షీణించి అవినీతి పెరిగిందనే ఆరోపణలు కూడా రావొచ్చన్నారు. పోలీసులు సరిగా విధులు నిర్వర్తిస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందన్నారు.

బాధితులను కూర్చోబెట్టి సమస్యలు వినండి

పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులను కూర్చోబెట్టి ఓపికగా మాట్లాడితే సగం సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నో



అవాంతరాలు, సంక్లిష్ట పరిస్థితులను దాటుకొని ఉద్యోగాలు సాధించిన యువ అధికారులు తమ నేపథ్యాన్ని మర్చిపోకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. 112 మంది డీఎస్పీల నియామకాన్ని తమ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా చేపట్టిందని కొందరు తప్పుడు ఆరోపణలు చేసినా సుప్రీంకోర్టులో న్యాయవాదులను పెట్టి అభ్యర్థులకు అండగా నిలబడ్డామని రేవంత్ గుర్తుచేశారు.

ప్రస్తుత రోజుల్లో పోలీసులకు సైబర్ క్రైమ్ అతిపెద్ద సవాల్ అని, వీటితోపాటు డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ప్రధానంగా దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. సైబర్ క్రైమ్, ఫోరెన్సిక్ విభాగాల్లో ఆసక్తి ఉన్న డీఎస్పీలను విదేశాలకు పంపి శిక్షణ ఇప్పిస్తామన్నారు. డీఎస్పీలు ఫిట్‌నెస్ విషయంలో రాజీపడొద్దని సూచించిన సీఎం 'బెల్ట్ లూజ్ అయిన పర్వాలేదు కానీ టైట్ కాకూడదు' అని సరదాగా వ్యాఖ్యానించారు.

పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన

గతంలో గ్రూప్-1 నియామకాల ప్రక్రియ చాలా ఆలస్యంగా జరిగేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆనాటి ప్రభుత్వ నిర్ణయాలు, నిర్లక్ష్యం చాలా మందికి తీరని నష్టాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బాధ్యతలు చేపట్టాక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ..మిగతా 2లో



డిజిటల్ అరెస్ట్ మోసాలపై

సుప్రీంకోర్టు సీరియస్

వాట్సాప్, టెక్ సంస్థలకు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ, నవంబర్ 10 (ప్రభాత ఉదయం)

దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న 'డిజిటల్ అరెస్ట్' సైబర్ మోసాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రోజురోజుకూ పెరిగిపోతున్న ఈ తరహా అత్యాధునిక సైబర్ నేరాలను అరికట్టేందుకు తక్షణమే పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని ప్రముఖ మెసేజింగ్ వేదిక వాట్సాప్‌తో పాటు ఇతర టెక్ మీడియేషన్ సంస్థలను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మోసాల నివారణకు తాము తీసుకుంటున్న, భవిష్యత్తులో తీసుకోబోయే ముందస్తు రక్షణ చర్యలపై సమగ్ర నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది. నకిలీ పత్రాలు, నకిలీ నోటీసుల ఆధారంగా జరుగుతున్న డిజిటల్ అరెస్టుల వ్యవహారాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది.

ఓయూ వీసీ ప్రభుత్వానికి

గులాంగిరి చేస్తున్నారు: కవిత

ఉస్మానియా యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగుల మహాధర్నా

హైదరాబాద్, నవంబర్ 10 (ప్రభాత ఉదయం)



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ భవనం ఎదుట నాన్‌టీచింగ్ ఉద్యోగులు చేపట్టిన మహాధర్నాకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం మద్దతు తెలిపారు. కాంట్రాక్ట్ సిబ్బంది సర్వీసుల క్రమబద్ధీకరణతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు చేపట్టిన ఈ ఆందోళనలో ఆమె స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించిన కవిత... రాష్ట్ర ప్రభుత్వంపై, విశ్వవిద్యాలయ ఉపకులపతి (వీసీ)పై తీవ్ర విమర్శలు గుప్పించారు. విశ్వవిద్యాలయ పరిపాలన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ... ఉద్యోగులను ఓయూ వీసీ పట్టించుకోవడం లేదని, ఆయన ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దాదాపు ఏడాదిన్నర కాలంగా ఉద్యోగులు నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం



కూకట్‌పల్లి భూముల వేలానికి వ్యతిరేకంగా భారీ నిరసన

ప్రజా అవసరాలకే భూములు కేటాయించాలని డిమాండ్

కెపిహెచ్‌బి భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం దారుణం

మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు రాజేందర్... ప్రభుత్వ భూములను వేలం వేస్తే చూస్తూ ఊరుకోం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు



కూకట్ పల్లి, నవంబర్ 10 (ప్రభాత ఉదయం)

కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కెపిహెచ్‌బి భూములను వేలం వేయొద్దని, కూకట్‌పల్లి హుడా ట్రక్ పార్క్‌కు సంబంధించిన ప్రభుత్వ భూములను విక్రయించవద్దని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ నిరసన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ విచ్చేసి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కూకట్ పల్లి నియోజకవర్గ ..మిగతా 2లో

నగరంలో రూ.4.49 కోట్ల అభివృద్ధి పనులకు

పొన్నం ప్రభాకర్, బండి సంజయ్ శంకుస్థాపన

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్, 10 (ప్రభాత ఉదయం):



ఎన్నికల వరకే రాజకీయాలు.. ఎన్నికల అనంతరం ప్రజా సంక్షేమం, జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులంతా కలిసి పనిచేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో కలిసి కరీంనగర్ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. వ్యక్తిగత రాజకీయాలకు అతీతంగా జిల్లా అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కరీంనగర్‌ను ఉత్తర తెలంగాణలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.46వ డివిజన్‌లో యూఐడీఎఫ్ నిధులు రూ.1.50 కోట్లతో చేపట్టనున్న బాక్స్ టైప్ డ్రైయిన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. 26వ డివిజన్‌లోని బుట్టి రాజారామ్ కాలనీ రోడ్డు, ముదిరాజ్ కాలనీల్లో రూ.కోటి నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు, 25వ డివిజన్‌లోని సుభాష్‌నగర్ ప్రధాన రహదారిపై రూ.కోటి నిధులతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే 23వ డివిజన్‌లోని సీతారాంపూర్, రెడ్డి ఫంక్షన్ హాల్ రోడ్డు పరిసరాల్లో యూఐడీఎఫ్ నిధులు రూ.65 లక్షలు, ఎంజీఎఫ్ నిధులు రూ.34 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. మొత్తంగా రూ.4.49 కోట్ల విలువైన పనులకు ఇద్దరు మంత్రులు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.రాజకీయాలకు అతీతంగా ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిధులను సద్వినియోగం చేసుకుంటూ కరీంనగర్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీలు, విద్య, వైద్య సదుపాయాల కల్పనలో సమష్టి కృషి అవసరమని స్పష్టం చేశారు. జిల్లా అభివృద్ధి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 70 నుంచి 90 శాతం వరకు పూర్తయి వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. సింగరేణి, ఎన్టీపీసీ, గోదావరి జలసంపదతో జిల్లాకు అపారమైన అభివృద్ధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ వనరులను సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో జిల్లాను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.విద్యారంగ అభివృద్ధిలో భాగంగా భీమదేవరపల్లిలో నవోదయ విద్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశామని, రాజన్న సిరిసిల్ల జిల్లాలోనూ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జమ్మికుంట, హుస్నాబాద్‌లో కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, ఫార్మసీ, ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్యా కోర్సులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని పూర్తి చేయడంతోపాటు వైద్య రంగంలో అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు.వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం, కొత్తకొండ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఎలగందుల ఖిల్లాతోపాటు జిల్లాలోని ఇతర పర్యాటక ప్రాంతాలు, జలవనరుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కరీంనగర్ నగరంలో పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా అర్బన్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో పట్టణాభివృద్ధి శాఖ బలోపేతం కోసం దాదాపు వెయ్యి కొత్త పోస్టుల భర్తీకి ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని వివరించారు.కరీంనగర్‌లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి అర్హులైన పేదలకు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరినట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజలకు సంబంధించిన ఉమ్మడి సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువస్తే సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన సూచనలు చేస్తూ జర్నలిస్టులు కూడా భాగస్వాములు కావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వీలైనన్ని నిధులు తీసుకొచ్చి అన్ని రంగాల్లో జిల్లాను అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్యతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మాదాపూర్ లోని మైండ్ స్పేస్ లోని ఓపెన్ హౌస్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర డిజిపి సీవీ ఆనంద్ తో పాటు ఇతర అధికారులు..

పోలీసు పిల్లల విద్యకు

ఆప్టిమస్ గ్రూప్ అండ..

రూ.50 లక్షల విరాళం!

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అభివృద్ధికి డాక్టర్ డి. శ్రీనివాసరెడ్డి భారీ చేయూత.. దాతలు ముందుకొచ్చి విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలి: డీజీపీ సీవీ ఆనంద్

శేరిలింగంపల్లి : నవంబర్ 10, (ప్రభాత ఉదయం)

పోలీసు కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు ఆధునిక విద్యా ప్రమాణాలతో తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటైన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అభివృద్ధికి ఆప్టిమస్ గ్రూప్ భారీ చేయూత అందించింది. ఆప్టిమస్ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ పార్ట్‌నర్ డాక్టర్ డి. శ్రీనివాసరెడ్డి పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.50 లక్షల విరాళాన్ని ప్రకటించారు. మంగళవారం మైండ్‌స్పేస్ లోని పెరెల్ క్లబ్‌లో నిర్వహించిన ఓపెన్ హౌస్ సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్‌కు విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషకరమన్నారు. పాఠశాలలో అత్యుత్తమ విద్యా ప్రమాణాలను నెలకొల్పేందుకు పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు, దాతలు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు, ఇతర రంగాల్లోనూ మెరుగైన అవకాశాలు కల్పించేలా పాఠశాలను అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. విరాళం అందించిన డాక్టర్ శ్రీనివాసరెడ్డిని అభినందించారు. రూ.50 లక్షల విరాళాన్ని పాఠశాలలో తరగతి గదులు, సైన్స్, టెక్నాలజీ ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా వసతులు, డిజిటల్ విద్యా సదుపాయాల అభివృద్ధికి వినియోగించనున్నారు. పోలీసు సిబ్బంది పిల్లలతోపాటు సాధారణ ప్రజల కుటుంబాలకు చెందిన పిల్లలకు సైతం సమాన ప్రాతిపదికన నాణ్యమైన విద్య అందించడం ఈ పాఠశాల ప్రధాన లక్ష్యంగా ఉంది.డాక్టర్ డి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పోలీసులంటే తనకు ఎంతో గౌరవమని, సమాజ భద్రత కోసం వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పోలీసు కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమని, ఆ దిశగా తమవంతు కృషి కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి. సృజన, ఎస్ఎస్సీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, ఐటీ రంగ సంస్థలు, ఆర్టీసీ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు నైపుణ్యాల అండ.. ఉపాధికి కొత్త బాట!

సిబ్బంది పిల్లలు, జీవిత భాగస్వాముల కోసం 'సంక్షేమ వారధి' కార్యక్రమం ప్రారంభం

ఉపాధి, స్వయం ఉపాధికి దోహదపడేలా 17 రంగాల్లో శిక్షణ.. పోలీసు కుటుంబాల భవిష్యత్తుకు సైబరాబాద్ పోలీసుల భరోసా

శేరిలింగంపల్లి : నవంబర్ 11, (ప్రభాత ఉదయం)



ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమయ్యే పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి సైబరాబాద్ పోలీస్ శాఖ మరో ముందడుగు వేసింది. పోలీసు సిబ్బంది పిల్లలు, జీవిత భాగస్వాములకు ఆధునిక కాలానికి అవసరమైన వృత్తి నైపుణ్యాలను అందించి, ఉపాధి అవకాశాలను చేరువ చేయాలనే లక్ష్యంతో పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆధ్వర్యంలో 'సంక్షేమ వారధి' పేరుతో ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేవలం సంక్షేమానికే పరిమితం కాకుండా, పోలీసు కుటుంబాలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమం ద్వారా సాంకేతిక, పారిశ్రామిక, వృత్తి విద్యా రంగాలకు సంబంధించిన పలు అంశాల్లో శిక్షణ అందించనున్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం, కార్యాలయ నిర్వహణకు అవసరమైన నైపుణ్యాలతో పాటు కృత్రిమ మేధస్సు వినియోగం, పత్రాల తయారీ, సమాచార సేకరణ, విశ్లేషణ వంటి అంశాల్లోనూ శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే నిఘా కెమెరాల మరమ్మతులు, లోహపు పనులు, సౌర విద్యుత్ సాంకేతికత, మానవరహిత విమానాల నిర్వహణ, త్రిమితీయ ముద్రణ, విద్యుత్ వాహనాల సాంకేతికత వంటి ఆధునిక రంగాల్లోనూ శిక్షణ కల్పించనున్నారు. కంప్యూటర్ల మరమ్మతులు, మొబైల్ ఫోన్ల మరమ్మతులు, యంత్రాల సంఖ్యా నియంత్రణ, అంతర్జాల అనుసంధాన పరికరాల నిర్వహణ, అర్థవాహక పరికరాల సాంకేతికత, పారిశ్రామిక స్వయంచాలక వ్యవస్థలపై అవగాహన కల్పించనున్నారు. సాంకేతిక రంగాలకే పరిమితం కాకుండా సౌందర్య సంరక్షణ, వస్త్ర రూపకల్పన వంటి స్వయం ఉపాధికి ఉపయోగపడే విభాగాల్లోనూ శిక్షణ అందించనున్నారు. వీటితో పాటు నైపుణ్య భారత్, టామ్‌కామ్ కార్యక్రమాల ద్వారా కూడా శిక్షణ అవకాశాలు కల్పించనున్నారు. ఈ శిక్షణ ద్వారా పోలీసు కుటుంబాల సభ్యులు తమ అభిరుచి, అర్హతలకు అనుగుణంగా ఒక రంగాన్ని ఎంచుకుని నైపుణ్యం పెంపొందించుకోవచ్చు. తద్వారా ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు పొందడంతో పాటు సొంతంగా ఉపాధి ప్రారంభించేందుకు కూడా మార్గం సుగమం కానుంది. ఈ కోర్సులకు సంబంధించిన వివరాలు, శిక్షణ విధానం, ప్రవేశ ప్రక్రియ తదితర అంశాలపై నవంబర్ 11న అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం అనంతరం శిక్షణ తరగతులను ప్రారంభించనున్నారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజల భద్రతకు అంకితమయ్యే పోలీసు సిబ్బంది కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించాలనే ఆలోచనకు 'సంక్షేమ వారధి' ప్రతిరూపంగా నిలుస్తోంది. పోలీసు కుటుంబాల్లోని యువతకు నైపుణ్యాలు, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఆత్మవిశ్వాసం, ఆర్థిక స్వావలంబనకు ఈ కార్యక్రమం దోహదపడనుంది.

ఏ హోదాకు వెళ్లినా

మన గతాన్ని మర్చిపోవద్దు

మొదటి పేజీ తరువాయి...

ప్రక్షాళన చేసి, నియామక ప్రక్రియ చేపట్టినట్లు గుర్తు చేశారు. గతంలో రాజకీయ పునరావాస కేంద్రంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉండేదని విమర్శించారు. అవగాహన లేనివారిని బోర్డులో నియమించి గత ప్రభుత్వం తప్పు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

"మీరు తీసుకున్న నిర్ణయాలే ఈ ప్రభుత్వానికి గీటురాయిగా మారుతాయి. పది మంది డీఎస్పీలు అరాచకంగా వ్యవహరించినా రాష్ట్రంలో సరైన పరిపాలన లేదనే ఆరోపణలు వస్తాయి. శాంతిభద్రతలు క్షీణించి అవినీతి పెరిగిందనే ఆరోపణలు కూడా రావొచ్చు. పోలీసులు సరిగా విధులు నిర్వర్తిస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుంది" –సీఎం రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

పోలీసుల గౌరవాన్ని సీనియర్లు పెంచారు

అధికారుల నుంచి ప్రభుత్వం కోట్లు ఆశించట్లేదని, ఎన్నికల్లో రిగ్గింగ్ చేయాలని ఆదేశాలు కూడా ఇవ్వడం లేదన్నారు. బాధ్యత గుర్తించి నిజాయితీగా విధులు నిర్వర్తించాలని మాత్రమే ప్రభుత్వం కోరుకుంటుందని తెలిపారు. సర్వం ఒడ్డి శాంతిభద్రతలు కాపాడి, పోలీసుల గౌరవాన్ని సీనియర్లు పెంచారన్న సీఎం, పోలీసు శాఖ విశ్వాసమైన విభాగంగా కొనసాగించాల్సిన బాధ్యత మీపై ఉందని అన్నారు.

ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణం

నిద్రమత్తులో సిఎంసి, రెవెన్యూ యంత్రాంగం?

సర్వే నెంబర్ 284 లోని 200 గజాల స్థలంలో నిర్మాణం పూర్తయి గృహప్రవేశానికి సిద్ధమైన భవనం

క్షేత్రస్థాయిలో విఫలమవుతున్న పర్యవేక్షణ

విచారణ జరిపి , చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

పటాన్ చెరు, నవంబర్ 10 (ప్రభాత ఉదయం):



ప్రభుత్వ భూముల రక్షణ కోసం పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని సిఎంసి, రెవెన్యూ అధికారులు చేస్తున్న ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బొల్లారం డివిజన్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 284లో సుమారు 200 గజాల స్థలంలో భారీ భవన నిర్మాణం చేపట్టిన ఉదంతం తాజాగా వెలుగులోకి వచ్చింది. అంత భారీ భవనం నిర్మాణం జరుగుతున్నా అధికారులు అటుగా తొంగి చూడకపోవడం గమనార్హం.

అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలుచ


ప్రభుత్వ స్థలాలను సంరక్షించాల్సిన బాధ్యత కలిగిన అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఆక్రమణలను ఆదిలోనే గుర్తించి అడ్డుకోవడంలో తీవ్రంగా విఫలమైందన్న విమర్శలు వస్తున్నాయి. పునాదుల దశలోనే నిలువరించాల్సిన నిర్మాణం, ఏకంగా భవనం పూర్తయి గృహప్రవేశానికి సిద్ధమయ్యేంత వరకు అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆక్రమణలపై కఠిన చర్యలు ఉంటాయని ఉన్నతాధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో ఇలాంటి అక్రమ కట్టడాలకు ఎలాంటి అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే అంశంపై స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నేతల ఒత్తిళ్లు.. తలొగ్గుతున్న అధికారులు

అక్రమ నిర్మాణాలకు, అనుమతి లేని నిర్మాణాల విషయంలో నేతలు అధికారులపై ఒత్తిడి చేయడం వల్ల ఈ నిర్మాణాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. అటు అధికార పార్టీ నేతలే కాకుండా,విపక్ష పార్టీ నేతలు సైతం ఇలాంటి అక్రమ నిర్మాణాలను సమర్థిస్తూ అధికారులను నయానోభయానో బెదిరించి పనులు పూర్తి చెయ్యడానికి సహకరిస్తున్నారు.

అక్రమ, అనుమతి లేని నిర్మాణాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి

అనుమతి లేకుండా నిర్మాణం పనులు చేయడం వల్ల ప్రభుత్వం భారీగా ఆదాయం కోల్పోతోంది. ఈ వ్యవహారంలో నేతల అండదండలు పుష్కలంగా ఉండటంతో పాటు, అధికారుల ఉదాసీనత కారణంగా ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది. అంతేకాకుండా ఎంతో విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి.



సర్వే నిర్వహించి చర్యలు చేపట్టాలి

ఇప్పటికైనా సంబంధిత హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి, సర్వే నెంబర్ 284లో సమగ్ర సర్వే నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణంపై నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ వ్యవహారంలో అధికారులు క్షేత్రస్థాయిలో ఎలాంటి దిద్దుబాటు చర్యలు చేపడతారో వేచి చూడాల్సి ఉంది.

ఓయూ వీసీ ప్రభుత్వానికి

గులాంగిరి చేస్తున్నారు: కవిత

మొదటి పేజీ తరువాయి...

అన్యాయమని కవిత అన్నారు. సుమారు 35 ఏళ్లుగా ఉద్యోగులు వివిధ ప్రభుత్వాల హయాంలో దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. నాన్‌టీచింగ్ సిబ్బంది పోరాటానికి పర్మినెంట్ ఉద్యోగులు కూడా మద్దతు తెలపడాన్ని ఆమె ప్రశంసించారు. విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్న రాష్ట్ర గవర్నర్ వెంటనే ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని, నాన్‌టీచింగ్ సిబ్బంది న్యాయమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్తానన్న రూ.వెయ్యి కోట్లు ఎక్కడ? అని ఆమె సూటిగా ప్రశ్నించారు.

కూకట్‌పల్లి భూముల వేలానికి వ్యతిరేకంగా భారీ నిరసన

మొదటి పేజీ తరువాయి...

బిజెపి నాయకులు కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ ప్రాంతంలోని ప్రభుత్వ భూముల వేలం ప్రతిపాదనపై ఎదుర్కొంటున్న ఆందోళనలను, సమస్యలను ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను ఆయన స్వీకరించి, వారి సమస్యలను సావధానంగా విన్నారు. అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ఏర్పాటు చేసిన సమయంలోనే ఈ ప్రాంత ప్రజల అవసరాలను, భవిష్యత్తు తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కొంత భూమిని పార్కులు, క్రీడా మైదానాలు, ఇతర ప్రజోపయోగ సదుపాయాల కోసం ఎమినిటీస్ స్థలాలుగా కేటాయించడం జరిగిందని గుర్తుచేశారు. అలాగే కూకట్ పల్లికి సంబంధించి ఆనాడు పట్టణ శివారు ప్రాంతంగా గుర్తించి రైతుల దగ్గర నుంచి భూమిని స్వీకరించి ట్రక్ పార్కింగ్ కోసం ఆ రోజు ఈ స్థలాన్ని కేటాయించారు. మరి ఇప్పుడు ఈ ప్రభుత్వం ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా కేవలం వారి అవసరాలనే దృష్టిలో ఉంచుకొని భూములను వేలం వెయ్యడం సరికాదని వారు గుర్తు చేశారు. ఇప్పటికే కూకట్‌పల్లి వంటి అత్యంత రద్దీ ప్రాంతంలో జనాభా రోజురోజుకూ పెరుగుతూ ప్రజలు అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజా అవసరాల కోసం అందుబాటులో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం అత్యంత దారుణమని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తు తరాల పిల్లల కోసం పార్కులు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రజలు స్వచ్ఛమైన గాలిని పీల్చుకునేలా పచ్చదనంతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన ప్రభుత్వం, విలువైన ప్రభుత్వ భూములను విక్రయించి ఆదాయం సమకూర్చుకోవాలనే ఆలోచన చేయడం సరికాదని ఈటల రాజేందర్ అన్నారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడే ప్రభుత్వ ఆస్తులను విక్రయించి లబ్ధి పొందాలనే ధోరణిని ప్రభుత్వం ప్రదర్శిస్తోందంటూ విమర్శించారు. ప్రజల అవసరాలు, భవిష్యత్తు తరాల ప్రయోజనాలను పక్కనపెట్టి వారి ఇష్టం వచ్చినట్టు ప్రజలు తీసుకునే ఇటువంటి నిర్ణయాలను ప్రజలు సహించరని, ప్రజలే తగిన సమయంలో తమ అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేస్తారని, ఎట్టి పరిస్థితుల్లోనూ కెపిహెచ్బి ప్రభుత్వ భూములు, కూకట్‌పల్లి హుడా ట్రక్ పార్క్ భూముల వేలం ప్రక్రియను నిలిపివేయాలని, ప్రభుత్వం తన నిర్ణయాన్ని తక్షణమే మార్చుకొని ఆ భూములను పూర్తిగా ప్రజా అవసరాలకే కేటాయించాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి జిల్లా బిజెపి అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా ఇన్చార్జ్ మాధవరం కాంతారావు, మూసాపేట్ డివి జన్ మాజీ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, బీజేపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ భూముల పరిరక్షణకు తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

వ్యవసాయ వర్శిటీ వైస్ చాన్సలర్‌ను భర్తరఫ్ చేసి విచారణ చేపట్టాలి

మాజీ మంత్రులు పి సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, సత్యవతి రాథోడ్ లు

రాజేంద్రనగర్, నవంబరు 10 (ప్రభాత ఉదయం) :

విద్యార్థులకు చదువు చెప్పే మహిళ అసిస్టెంట్ ప్రొఫెసర్ తనను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య లైంగికంగా వేధించాడని ఆరోపణలు చేస్తు ఉమెన్స్ సేఫ్టీ డీజీకి, రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేసిన స్పందన రాకపోతే, వర్శిటీ వైస్ చాన్సలర్ అయిన గవర్నర్ కు ఫిర్యాదు చేసిందని, అయినా స్పందించకపోవడం బాధాకరమని మాజీ మంత్రులు పి సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, సత్యవతి రాథోడ్ లు ఆరోపించారు. తనకు న్యాయం చేయాలంటు రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో టీచింగ్, నాన్ టీచిం గ్ ఉద్యోగులు, విద్యార్థుల తో కలసి నిరసన తెలుపుతున్న బాధిత అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజశ్రీ ని మంగళవారం వారు కలసి సంఘీభావం తెలిపారు. తేజశ్రీ తో మాట్లాడి జరిగిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, మహిళ అసిస్టెంట్ ప్రొఫెసర్ తనను లైంగికంగా వేదించాడంటు ఫిర్యాదు. చేస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ను వెంటనే భర్తరఫ్ చేయాలని గవర్నర్ కు విజ్ఞప్తి చేశారు. తేజశ్రీ ఏర్యాదు మేరకు ఆయనపై ఎస్ఐఆర్ నమోదు చేసి, విశ్రాంత వైస్ చాన్సలర్ల చేత కమిటీ వేసి విచారాణ జరిపించాలన్నారు. ఓ మహిళ అసిస్టెంట్ ప్రొఫెసర్ తనకు జరిగిన అన్యాయం గురించి స్వయంగా డీజీపీ ని కలసి విర్యాదు చేసి 15 రోజులైన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం భాదాకరమన్నారు. చిన్న గొడవ పడి ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేసే పోలీసులు డీజీపీ కి ఫిర్యాదు చేసినా కేసు ఎందుకు నమోదు చేయలేదో అర్థం కావడం లేదన్నారు. గవర్నర్ కు తనకు జరిగిన అన్యాయం గురించి ఆన్ లైన్ ద్వారా ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేకపోవడం భాదాకరమన్నారు. చదువుకున్న విద్యావంతురాలు, అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఉన్న వ్యక్తి



వ్యవసాయ విశ్వవిద్యాలయం లో బాధిత అసిస్టెంట్ ప్రొఫెసర్ కు మద్దతుగా రోడ్డు పై బైఠాయించిన మాజీ మంత్రులు



అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజ శ్రీ కి మద్దతుగా మాట్లాడుతున్న మాజీ మంత్రులు పి సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, సత్యవతి రాథోడ్ లు

ఫిర్యాదు చేస్తేనే దిక్కుమొక్కు లేకుండా పోయిందని సామాన్యుల పరిస్థితేంటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కళ్లు తెరవండని మాజీ మంత్రులు సూచించారు. హైదరాబాద్ నడిబొడ్డున దేవాలయం లాంటి విశ్వవిద్యాలయంలో ఇలాంటి సంఘటనలు జరుగడం బాధాకరమన్నారు. బాదితురాలుకు మద్దతు తెలపడానికి వస్తున్న బీఆర్ఎస్. కార్యకర్తలను, నాయకులను ఎక్కడిక్కడే అరెస్టులు చేస్తున్నారని, ఓ మహిళ న్యాయం కోసం డీజీపీ ని కలసిన అవతలి వ్యక్తిపై చర్యలుండవా అని ప్రశ్నించారు. మహిళా కమిషన్ సుమోటో గా ఈ సంఘటన ను తీసుకొని ఈ నెల 12న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ను విచారణ కు హాజరు కావాలని పిలవడం సంతోషకరమని, బాదితురాలుకు న్యాయం జరిగే విదంగా చూడాలన్నారు. ట్రాన్స్ ఫర్ చేసినందుకే మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ వైస్ చాన్సలర్ పై ఫిర్యాదు చేస్తుందని అంటున్నారని, ఓ మహిళ ట్రాన్స్ ఫర్ కోసం వ్యక్తిత్వంపై నిందవేసుకోదన్నారు. తెలంగాణ లో శాంతిభద్రలు లేకుండా పోయాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దనే హోంశాఖ, విద్యాశాఖ ఉందని ఆయన జోక్యం చేసుకుని వ్యవసాయ విశ్వవిద్యాలయం సంఘటన పట్ల న్యాయం చేయాలన్నారు. మూడు నెలల క్రితం ఒక పని కోసం వెళ్లిన మహిళలను ముఖ్యమంత్రి దగ్గరి వ్యక్తి గెస్ట్ హౌజ్ కు రమ్మని పిలిచారని, ఆ మహిళ ఆరోపిస్తే ఇప్పటి వరకు ఆ సంఘటన పై ఎలాంటి చర్యలు లేవన్నారు. ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డి భాధ్యతలు చేపట్టాక రాష్ట్రంలో ఎన్ని ఫోక్సో కేసులు నమోదయ్యాయో వివరాలను తెప్పించుకుని చూడాలన్నారు. క్రైం రేట్ రాష్ట్రంలో ఎందుకు పెరుగుతుందో తెలుసుకోవాలన్నారు. ఇప్పటికైన స్పందించాలని, చదువు చెప్పే అసిస్టెంట్ ప్రొఫెసర్ కు న్యాయం చేయాలన్నారు. బాధిత మహిళ సీఎంఓ కార్యాలయంలో, వ్యవసాయ శాఖ కార్యదర్శి ని కలసి ఫిర్యాదు చేసినట్లు తెలిసిందని, వాటిపై న్యాయ విచారణ చేపట్టాలన్నారు. వైస్ చాన్సలర్ పై ఫిర్యాదు చేసినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఫోష్ 2013 చట్టం ప్రకారం ఎక్స్ టర్నల్ కమిటీ వేసి మహిళలకు భద్రత కల్పించాలన్నారు. వైస్ చాన్సలర్ కొం దరిని ప్రోత్సహించి బాధిత మహిళ పై దాడులకు, విమర్శలకు పాల్పడుతున్నాడని. అతన్ని పదవి నుంచి తప్పించి న్యాయవిచారణ జరిపించాలన్నారు.

మూడు రోజులుగా వ్యవసాయ వర్శిటీలో ఘర్షణ వాతావరణం



బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి ని అరెస్ట్ చేయడానికి చుట్టు ముట్టిన పోలీసులు..



వర్శిటీలో పీ హెచ్ డీ స్కాలర్ గా ఉన్న రాజ్ కుమార్ ను అరెస్ట్ చేస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్..



తమకు రక్షణ కల్పించాలని కోరుతున్న విద్యార్థినులు

బుద్వేల్, నవంబరు 10 (ప్రభాత ఉదయం)

రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం లో ఘర్షణ వాతావరణం నెలకొంది. వర్శిటీ లో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజశ్రీ తనను వైస్ చాన్సలర్ వాట్సాప్ కాల్ ద్వారా వేదిస్తు మాట్లాడాడని, న్యాయం చేయాలని కోరుతు నిరసన చేపట్టగా ఆమెకు కొందరు మద్దతు తెలుపుతున్నారు. వైస్ చాన్సలర్ మంచి వ్యక్తి అని బీసీ వైస్ చాన్సలర్ అయినందునే ఆయన పై బురద జల్లడానికి కొందరు కుట్ర చేస్తున్నారని మరి కొం దరు వైస్ చాన్సలర్ కు మద్దతు తెలుపుతున్నారు. ఈ రెండు గ్రూపులు నిరసనలు, మద్దతు ర్యాలీలు నిర్వహిస్తుండటంతో వ్యవసాయ విశ్వవిద్యాలయం లో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీనిని మేధావులనైన వర్శిటీ శాస్త్రవేత్తలు, విశ్రాంత వైస్ చాన్సలర్లు కల్పించుకుని వ్యవసాయ విశ్వవిద్యాలయం లో శాంతిని నెలకొల్పా విదంగా చూడాలని తటస్థులు సూచిస్తున్నారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మంగళవారం ఈ సంఘటన పై పూర్తి విచారణ చేపట్టాలని డీజీపీ కి లేఖ రాశారు. అదే సమయంలో ఈ సంఘటన పట్ల ఈ నెల 12వ తేదీ మహిళా కమిషన్ వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తో పాటు బాధిత అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజశ్రీ ని విచారణ కు హాజరు కావాలని పిలిచింది. ఈ నేపధ్యం లో ఇరు గ్రూపులు శాంతి యుత వాతావరణాన్ని కల్పించడంలో దృష్టి సారించేలా వర్శిటీ సీనియర్ శాస్త్రవేత్తలు ఇరు గ్రూపుల వారితో మాట్లాడి సర్ది చెప్పాలన్నారు. అదే సమయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ సంఘటన పై విచారణ జరిపి త్వరగా తేల్చాలని కోరుతున్నారు.

పలువురు అరెస్ట్ :

బాధిత మహిళ అసిస్టెంట్ ప్రొఫెసర్ కు మద్దతు తెలుపుతు విద్యార్థులను కూడగడుతున్న పీహెచ్ డీ స్కాలర్ రాజ్ కుమార్ ను రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేశారు. విద్యార్థులను అనవసరంగా ఈ సంఘటన లోకి లాగుతున్నారనే కోపం తో ఆయన రాజ్ కుమార్ ను అరెస్ట్ చేసినట్లు తెలస్తుంది. మహిళ అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజశ్రీ కి మద్దతు తెలుపడానికి వచ్చిన బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి ని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ముందు పోలీసులు అరెస్ట్ చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కి బయట వారిని ఎవరిని రానీయకుండ పోలీసులు గట్టి బం దోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు తమ ఆధీనంలోకి వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిసరాలను తీసుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహిళలకు రక్షణ కల్పించాలి: విద్యార్థినీలు

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న గొడవలు, నిరసనలు, ధర్నాలు, పత్రికలలో వస్తున్న వార్తలు, యూట్యూబ్ లో ప్రసారమౌతున్న విషయాలను చూస్తుంటే భయం వేస్తుం దని విద్యార్థినీలు వాపోతున్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థినీలకు, మహిళా ప్రొఫెసర్లకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత వర్శిటీ ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి ఉందని గుర్తు చేశారు.

అక్నాలెడ్జ్‌మెంట్ ఇవ్వాలని నిరసన



రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ ముందు బాధిత అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజ శ్రీ



కేసు నమోదు చేసుకున్నట్లు అక్నలెడ్జ్ మెంట్ ఇవ్వాలని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ ముందు నినాదాలు చేస్తున్న విద్యార్థులు

బుద్వేల్ , నవంబరు 10 (ప్రభాత ఉదయం) :

తనను వాట్సాప్ కాల్ ద్వారా, వైస్ ఛాన్సలర్ ఛాంబర్ లో వేధింపు మాటలతో లైంగికంగా ఇబ్బంది పెట్టిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య పై మంగళవారం సాయంత్రం బాధిత అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజ శ్రీ పిర్యాదు చేశారు. అందుకు సంబంధించిన అక్నాలెడ్జ్ మెంట్ ఇవ్వాలని ఆమె పోలీసులను కోరగా బుధవారం ఉదయం ఇస్తామని చెప్పారు. దానికి ఒప్పుకోని తేజశ్రీ పోలీస్ స్టేషన్ వద్ద నిరసనకు దిగారు. ఆమెకు మద్దతుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు పోలీస్ స్టేషన్ కు చేరుకుని సంఘీభావం తెలిపారు.

రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంకు వచ్చిన పలువురు బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్



రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ లో బి ఆర్ ఎస్ నాయకులు



కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్ లో బి ఆర్ ఎస్ నాయకులు



పోలీసులతో మాట్లాడుతున్న బి ఆర్ ఎస్ నాయకులు

రాజేంద్రనగర్, నవంబరు 10 (ప్రభాత ఉదయం)

రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజశ్రీ కి న్యాయం చేయాలని కోరుతు, ఆమెకు మద్దతు తెలుపడానికి వచ్చిన పలువురు బీఆర్ఎస్ నాయకులను మంగళవారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆవరణలో పోలీసులు అరెస్ట్ చేసి రాజేంద్రనగర్, కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్ లకు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ నాయకులు కొలన్ సుబాష్ రెడ్డి, పోరెడ్డి ధర్మారెడ్డి, ఎస్ వెంకటేశ్, అక్కెం రాఘవేందర్ యాదవ్, ఎర్రోళ్ల యాదయ్య. శీలం తిరుపతి రెడ్డి, బండ రాజేశ్ యాదవ్, గుమ్మడి కుమార్, ఎడ్లకాడి సూర్యం, డి రమేశ్ ముదిరాజ్, వాసు, సరికొండ దుర్గేశ్. కట్టెల నుండి గౌతమ్, పిట్టల శివ ముదిరాజ్ తదితరులున్నారు.



వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌కు మద్దతుగా నినాదాలు చేస్తున్న అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు

కావాలనే వైస్ చాన్సలర్‌పై కుట్ర

ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు

రాజేంద్రనగర్, నవంబరు 10 (ప్రభాత ఉదయం):

వ్యవసాయ విశ్వవిద్యాలయం లో వ్యక్తిగత హననాన్ని ఆ పాలని, రాజకీయాలకు తావు ఇవ్వవద్దని, వైస్ చాన్సలర్ పై వచ్చిన ఆరోపణలపై నిష్పాక్షపాతంగా విచారణ జరుపాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం శ్రీనివాస్ యాదవ్, వర్శిటీ ఎస్సీ ఎస్టీ సెల్ ఇంచార్జి, ప్రొఫెసర్ రాజేశ్వర్ నాయక్ లు అన్నారు. వ్యవసాయ వర్శిటీ వైస్ చాన్సలర్ కు మద్దతుగా మంగళవారం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు, టీచర్లు రాజేంద్రనగర్ లోని వ్యవసాయ కళాశాల ఆవరణలో సమావేశమైనారు. బ్యానర్లు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, ట్రైం స్కేల్ సిబ్బంది, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్, అగ్రికల్చర్ కార్మికులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఇష్టం లేకున్నా, బలవంతంగా ధర్నాలకు తీసుకువెళుతున్నారని, తరగతులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. ట్రాన్స్ ఫార్మర్ లు అయిన వారు మాత్రమే వీసీకి వ్యతిరేకంగా బాధిత మహిళకు న్యాయం చేయాలని కోరుతున్నారన్నారు. ప్రమోషన్లు పొంది బదిలీ అయిన వారు కూడా కు ట్ర తో వైస్ చాన్సలర్ కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారన్నారు. సంఘటన జరిగినప్పుడే వీసీ పై ఫిర్యాదు చేస్తే తాము కూడా ఆమెకు అండగా నిలిచేవారమని, సంఘటన జరిగి 9నెలలు గడిచిన తర్వాత ఫిర్యాదు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఆమెను బదిలీ చేసినందుకే వీసీపై ఆరోపణలు చేస్తున్నారని చేస్తున్నారని అనుమానిస్తున్నామన్నారు. తేజశ్రీ కి మద్దతుగా నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కొందరు విద్యార్థులు ప్రొఫెసర్లను బ్రోకర్లని, బ్రోతల్ హౌజ్ నడుపుతున్నారా.. అని, వ్యవసాయ వర్శిటీ ని ఓయో రూములుగా మారుస్తున్నారా.. అని మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వారి వెనుక ఉన్న ప్రొఫెసర్లు వీటిని ఖండించకపోవడం బాధాకరమన్నారు. వైస్ చాన్సలర్గా పనిచేస్తున్న ప్రొఫెసర్ అల్బాస్ జానయ్య పై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. ఆయన అంతర్జాతీయ స్థాయి లో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ అంజయ్య, డాక్టర్ రాజమణి, డాక్టర్ మాధవి లత, డాక్టర్ శైలజ, డాక్టర్ ఎల్లగౌడ్, అయేషా, నాగమణి, బి బిక్షపతి, రవీందర్ రెడ్డి, షేక్ నజీర్, ఎం దశరథ, ఎం సంజీవరెడ్డి, ఎం రమేశ్, ఎం క్రిష్ణ, డాక్టర్ శంకర్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తనపై వస్తున్న ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరుపాలని డీజీపీకి వ్యవసాయ వర్శిటీ వైస్ చాన్సలర్ లేఖ

రాజేంద్రనగర్, నవంబరు 10 (ప్రభాత ఉదయం)

తనపై వస్తున్న ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరుతు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మంగళవారం రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కు లేఖ రాశారు.ఈ విషయాన్ని వర్శిటీ ప్రజా సంబంధాల అధికారి ద్వారా మీడియా కు వెల్లడిచేశారు. ఈ సంఘటన పై నిజా నిజాలను బహిర్గతం చేయాలని, కుట్ర కోణాలను వెలికితీయాలని డీజీపీ కి రాసిన లేఖ లో పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా తనపై వస్తున్న ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపిం చాలన్నారు. సాదారణ పరిపాలన బదిలీపై కక్షగట్టి తనపై నిరాధారణ ఆరోపణలు చేయిస్తున్నారన్నారు. 11నెలల పాటు మౌనంగా ఉండి, ఇప్పుడు బురద జల్లే యత్నం వెనుక అసలు కుట్రదారులు ఎవరో సమ గ్ర విచారణ జరిపి తేల్చాలన్నారు. బదిలీల ముసుగులో అసత్యాలకు ప్రచారం తెరలేపారన్నారు. యూనివర్శిటీ ని 2047 నాటికి సవాళ్లకు దీటుగా తీర్చిదిద్దడానికి, రైతాంగానికి ఉత్తమ సేవలు అందిం చడమే లక్ష్యంగా పనిచేస్తున్నానన్నారు. గడిచిన కొన్ని నెలలుగా సదరు అధ్యాపకురాలికి, తనకు మధ్య జరిగిన వాట్సాప్ చాట్లు, కాల్ హిస్టరీలు తదితర డిజిటల్ ఆధారాలన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ దారుణ మైన కుట్రపై పోలీసులు వెంటనే స్పందించి సమగ్ర దర్యాప్తు జరపాలన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్ సర్కిల్ లో రూ.2.37 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపనలు

రాజేంద్రనగర్, నవంబరు 10 (ప్రభాత ఉదయం)

రాజేంద్రనగర్ సర్కిల్ లో రూ. 2.37 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన లు చేశారు. రాజేంద్రనగర్ జల మండలి అధికారుల ఆధ్వర్వంలో ఈ పనులు జరుగనున్నాయి. గోల్డెన్ హైట్స్ కాలనీ, బుద్వేల్ ప్రాంతాలలో ఈ పనులు చేపట్టనున్నారు. మంచినీటి పైపు లైన్ నిర్మాణం తో పాటు సీవరేజి పైపులైన్ పనులకు శ్రీకారం చుట్టడం జరుగుందని ఎమ్మెల్యే టీ ప్రకాష్ గౌడ్ తెలిపారు. ఈ పైపు లైన్ పనులు పూర్తయితే ఆయా ప్రాంతాలలో త్రాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. కొన్ని ప్రాంతాలలో డ్రైనేజీ సమస్య కూడా దూరం అవుతుందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తి ంచి వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కోట్లాది రూ పాయలతో అభివృద్ధి పనులను చేస్తున్నామన్నారు. ప్రజలకు అందుబాటు లో ఉండి వారి కష్టసుఖాలలో పాలు పంచుకోవడమే తన ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు సాలు లక్ష్మీ, జోహర్ అలీ, నాయకులు బి మహేందర్ గౌడ్, పడమటి శ్రీధర్ రెడ్డి, రగడంపల్లి శ్రావణ్, పెండ్యాల సాయిమల్లిక్, నందిగామ నర్సింహ్మ, ఎం ప్రభాకర్ రెడ్డి, ఎం శ్రీకాంత్, పెండ్యాల శ్రీధర్, గోల్కొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా శిశు భద్రతకు ఒకే గూడుగు కిందకు

ఒకే ప్రాంగణంలో నాలుగు కీలక విభాగాలు.. బాధితులకు సమగ్ర సేవలు

గచ్చిబౌలిలో ప్రత్యేక భవనం ప్రారంభం.. మహిళలు, చిన్నారుల రక్షణకు పోలీసుశాఖ ప్రత్యేక కార్యాచరణ

తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం..భవన నిర్మాణానికి రహేజా సంస్థ ఆర్థిక సహకారం

శేరిలింగంపల్లి : నవంబర్ 10, (ప్రభాత ఉదయం)

మహిళలు, చిన్నారులపై జరిగే వేధింపులు, అక్రమ రవాణా, లైంగిక దాడులు, కుటుంబ కలహాలు.. ఇలా సమస్య ఏదైనా ఇకపై సహాయం కోసం వేర్వేరు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. బాధితులకు అండగా నిలిచే నాలుగు కీలక విభాగాలను ఒకే ప్రాంగణంలోకి తీసుకువస్తూ సైబరాబాద్ పోలీసుశాఖ గచ్చిబౌలిలో ప్రత్యేక భవనాన్ని ఏర్పాటు చేసింది. మహిళల రక్షణ, చిన్నారుల భద్రత, బాధితులకు అండ, కుటుంబ సమస్యల పరిష్కారం లక్ష్యంగా నిర్మించిన ఈ భవనాన్ని మంగళవారం తెలంగాణ రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ సీవీ ఆనంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ... మహిళలకు సంబంధించిన అన్ని ఫిర్యాదులు పరిష్కారాలు ఒకే వేదిక పైకి రావడం అభినందనీయం అన్నారు. మహిళలకు సంబంధించిన బరోషా కేంద్రాన్ని దశాబ్ద కాలం క్రితమే ప్రారంభించడం జరిగిందని ప్రస్తుతం సొంత భవనం లోకి రావాడం. ప్రజలకు అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందని ఆనంద్ అన్నారు. సైబరాబాద్ లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని అధికారులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పిన డిజిపి ప్రయత్నం చేస్తేనే పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ట్రాఫిక్ ను వన్ వే చేసేటప్పుడు ముందుగా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం యోగాలుకు పూను కోవాలని డీజీపీ వివరించారు. మహిళలు, చిన్నారుల సంక్షేమం, భద్రత కోసం పనిచేస్తున్న మహిళా బృందాలు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, భరోసా కేంద్రం, మహిళా అభివృద్ధి, సాధికారత కేంద్రం ఇకపై ఒకే భవనంలో కార్యకలాపాలు నిర్వహించనున్నాయన్నారు. దీనివల్ల బాధితులకు అవసరమైన సహాయం ఒకే చోట లభించడంతో పాటు, వివిధ విభాగాల మధ్య



మహిళ శిశు భద్రత "బరోసా" భవనం ప్రారంభించిన డీజీపీ

సమన్వయం మరింత బలోపేతం కానుందని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీసు కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, సంయుక్త పోలీసు కమిషనర్ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి ప్రాంతాల ఉప పోలీసు కమిషనర్లు రితిరాజ్, కోటి రెడ్డి, సీహెచ్. శ్రీనివాస్‌తో పాటు ట్రాఫిక్ ఉప పోలీసు కమిషనర్ శేషాద్రిని, పరిపాలన విభాగం ఉప పోలీసు కమిషనర్ టీ. అన్నపూర్ణ, ప్రత్యేక విభాగం ఉప పోలీసు కమిషనర్ వైవీఎస్ సుధీంద్ర, మహిళా శిశు భద్రత విభాగం ఉప పోలీసు కమిషనర్ కె. సృజన, సైబరాబాద్ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ జి. సృజన, శేరిలింగంపల్లి శాసనసభ్యుడు అరెకపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ భవన నిర్మాణానికి రహేజా సంస్థ తమ సామాజిక బాధ్యత నిధుల నుంచి ఆర్థిక సహకారం అందించింది. సంస్థ సంచాలకుడు శర్వణ్ గోన్ నిధుల సమీకరణలో కీలక పాత్ర పోషించారు. పోలీసుశాఖకు, రహేజా సంస్థకు మధ్య సమన్వయం కల్పిస్తూ సైబరాబాద్ భద్రతా మండలి ఈ నిర్మాణం కార్యరూపం దాల్చేందుకు కృషి చేసింది. ఈ భవనంలో పనిచేసే నాలుగు విభాగాలు తమ పరిధిలో ప్రత్యేక సేవలు అందించనున్నాయి. మహిళా బృందాలు మహిళలపై వేధింపులు, అసభ్య ప్రవర్తన వంటి ఘటనలను అరికట్టేందుకు కృషి చేస్తాయి. మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం మహిళలు, చిన్నారులను అక్రమ రవాణా, దోపిడీ నుంచి కాపాడటంపై దృష్టి సారిస్తుంది. భరోసా కేంద్రం లైంగిక దాడులు, వేధింపులకు గురైన బాధితులకు అవసరమైన సహాయం, అండ అందిస్తుంది. మహిళా అభివృద్ధి, సాధికారత కేంద్రం కుటుంబ, దాంపత్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి నిపుణుల ద్వారా సలహాలు, సంప్రదింపుల సేవలు అందిస్తుంది. నాలుగు విభాగాలూ ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి రావడం వల్ల బాధితులకు సత్వర సహాయం అందించేందుకు మార్గం సుగమం కానుంది. మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన సమస్యలను సమగ్రంగా పరిష్కరించడంతో పాటు, వారికి రక్షణ, న్యాయం, మానసిక ధైర్యం కల్పించడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషించనుందని ముఖ్య అతిథులు అభిప్రాయపడ్డారు.



కురేన్ ఘాట్' సినిమా పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాల,నవంబర్ 10,(ప్రభాత ఉదయం)

మంచిర్యాల జిల్లా దేవాపూర్ ప్రాంతంలో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కళాకారులు రూపొందించిన 'కురేన్ ఘాట్' సినిమా పోస్టర్‌ను మంగళవారం మందమర్రిలో ఆవిష్కరించారు, మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి, జిల్లా నృత్య కళా సమాఖ్య అధ్యక్షుడు రాకం సంతోష్ పోస్టర్‌ను విడుదల చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక కళాకారులు సినిమా నిర్మాణం చేపట్టడం అభినందనీయమని, ప్రతి ఒక్కరూ సినిమాను ఆదరించి ప్రోత్సహించాలని కోరారు, ఈ చిత్రానికి దొబ్బల శంకర్ నిర్మాతగా, దుర్గం విజయ్ దర్శకుడిగా వ్యవహరించారు. శ్రీమాన్ హీరోగా, తోట మహేష్ విలన్‌గా నటించారు, ఈ కార్యక్రమంలో యూట్యూబ్ ఇన్‌ఫ్లూయెన్సర్ అనుదీప్, డ్యాన్స్ మాస్టర్ రిథమ్ సది, నమ్రిత్, గౌరీష్, గిరి, ఫైట్ మాస్టర్ రమేష్ రాజా, ముదారపు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య ఆరోగ్య శాఖలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసిన అదనపు కలెక్టర్

మెరిట్ ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలి: జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 10(ప్రభాత ఉదయం)

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అన్నారు.జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్,అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్న 49 పోస్టులకు సంబంధించి మెరిట్ ఆధారంగా ఎంపికైన అర్హులైన అభ్యర్థులకు మంగళవారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు అదనపు కలెక్టర్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తోందని తెలిపారు.నియామకాలు పొందిన అభ్యర్థులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా, అంకితభావంతో నిర్వహించాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తారని, విధుల నిర్వహణలో సమయపాలన,క్రమశిక్షణ, సేవాభావం పాటించాలని పేర్కొన్నారు.ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రజల్లో ప్రభుత్వ వైద్య వ్యవస్థపై నమ్మకాన్ని మరింత పెంపొందించాలని సూచించారు.జిల్లాలో మొత్తం 49 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, వాటిలో జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో 36 పోస్టులు,ఆయుష్ విభాగంలో 08 పోస్టులు, జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం పరిధిలో 05 పోస్టులు ఉన్నాయని తెలిపారు.నోటిఫికేషన్ ప్రకారం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, నిర్దేశించిన అర్హతలు, మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు.ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల విద్యార్హతలు, ఇతర ధ్రువపత్రాలను పరిశీలించి నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసిన అనంతరం వారికి నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ నియామకాల ద్వారా జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ సేవలు మరింత బలోపేతం కావడంతో పాటు, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు దోహదపడుతుందని అదనపు కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. నియామకాలు పొందిన అభ్యర్థులందరికీ అభినందనలు తెలియజేస్తూ,తమ వృత్తిపరమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సంధ్య కిరణ్మయి,వైద్య సిబ్బంది ఎంపికైన అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు



కబడ్డీ క్రీడాకారులకు డీకే స్నిగ్ధారెడ్డి ప్రోత్సాహం

జాతీయ స్థాయి క్రీడాకారుడు అజిత్‌కు సన్మానం

శిక్షణ పొందుతున్న వారికి పండ్లు, గుడ్లు పంపిణీ

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 10(ప్రభాత ఉదయం)

:గద్వాల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో కొనసాగుతున్న జిల్లా కబడ్డీ క్రీడాకారుల శిక్షణ శిబిరాన్ని మంగళవారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షురాలు డీకే స్నిగ్ధారెడ్డి సందర్శించారు. క్రీడాకారులతో మాట్లాడి శిక్షణ వివరాలు తెలుసుకున్నారు. నిరంతర సాధన, క్రమశిక్షణతో క్రీడల్లో రాణించాలని సూచించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన జూనియర్ కబడ్డీ క్రీడాకారుడు అజిత్‌ను సన్మానించి అభినందించారు. అనంతరం శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు పండ్లు, గుడ్లు పంపిణీ చేశారు. క్రీడాకారుల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకటరాములు, నాయకుడు రఘుగౌడ్, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నరసింహ, ట్రెజరర్ చందు, జాయింట్ సెక్రటరీ టీ.రవి తదితరులు



వెంకన్న బ్రహ్మోత్సవాల పాల్గొన్న ఎంపీ డీకే అరుణ

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 10(ప్రభాత ఉదయం):

కేటిదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, బీజేపీ జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ ఈఓ పురేందర్, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, కేటిదొడ్డి మండల నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు



గ్రీన్ వాటర్ ట్యాంకర్ల నిర్వహణను పరిశీలించిన జలమండలి జేఎండీ మయాంక్ మిట్టల్

ముల్లకత్వ చెరువు ఎస్టీపీ, గ్రీన్ ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ తనిఖీ

శుద్ధి చేసిన నీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం

ఎయిర్ టెక్ మిషన్లలో తాగునీటికి బదులుగా శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచన

హైదరాబాద్, నవంబర్ 10(ప్రభాత ఉదయం)

ఎయిర్ టెక్ మిషన్లలో తాగునీటికి బదులుగా శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలని జలమండలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జేఎండీ) మయాంక్ మిట్టల్ సూచించారు. మంగళవారం ముల్లకత్వ చెరువు మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని (ఎస్టీపీ) ఆయన సందర్శించి, గ్రీన్ వాటర్ ట్యాంకర్ల కార్యకలాపాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్టీపీలో ఏర్పాటు చేసిన గ్రీన్ ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. శుద్ధి చేసిన నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా



ఫిల్లింగ్ స్టేషన్‌ను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దశలో నీటి నాణ్యతను నిర్ధారించుకోవాలని, నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.ముఖ్యంగా జలమండలి పరిధిలో వినియోగిస్తున్న ఎయిర్ టెక్ మిషన్లలో తాగునీటికి బదులుగా ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని ఉపయోగించేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా నిర్మాణ పనులు, ఉద్యానవనాల నిర్వహణ, రోడ్ల శుభ్రత తదితర తాగేతర అవసరాలకు శుద్ధి చేసిన నీటి వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. తద్వారా విలువైన తాగునీటిని ఆదా చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జలమండలి సైబరాబాద్ ఈడి సంతోష్, ఎస్టీపీ సీజియం పద్మజాతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికులకు క్యాజువల్ పండుగ సెలవులు అమలు చేయాలి

తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 10(ప్రభాత ఉదయం)

మున్సిపల్ కార్మికులకు క్యాజువల్ పండుగ సెలవులు అమలు చేయాలని తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి కోరారు. మంగళవారం తెలంగాణ మున్సిపల్ స్టాప్, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.మద్దిలేటి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ సీ.ఎన్.రఘు ప్రసాద్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కార్మికులకు 15 క్యాజువల్, 8 పండుగ సెలవులు అమలు చేయాలని కార్మికులకు రొటేషన్ పద్ధతిలో ఎఫ్.ఆర్.ఎస్ లో నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అడిషనల్ కమిషనర్ సి.ఎన్.రఘు ప్రసాద్ స్పందిస్తూ జాయింట్ కమిషనర్ పి శ్రావణి హెల్త్ శానిటేషన్ కి ఐటీ సెక్షన్ వారికి లిఖితపూర్వకంగా ఆదేశాలు ఇవ్వాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంఘం నాయకులు బి విక్రమ్ పాల్గొన్నారు.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

రెడ్డి సేవా సమితి నూతన కార్యవర్గానికి ఎంపీ డీకే అరుణ అభినందనలు





జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 10(ప్రభాత ఉదయం):

నడిగడ్డ రెడ్డి సేవా సమితి నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం గద్వాలలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.నూతన కార్యవర్గ సభ్యులను అభినందించిన ఎంపీ డీకే అరుణ.. సమాజ సేవలో ముందుండాలని, ఐకమత్యంతో పనిచేస్తూ పేదలకు అండగా నిలవాలని సూచించారు. డీకే స్నిగ్ధారెడ్డి సైతం సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువ కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు పి. సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. పరమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారి అశోక్‌కుమార్‌రెడ్డి, మారుతి శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి, మీడియా ఇన్‌చార్జి జగదీశ్వర్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సాధు ప్రతాప్ రెడ్డి

కొడంగల్‌లోని నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ నాయకులు

కూకట్‌పల్లి, నవంబరు 10 (ప్రభాత ఉదయం)

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. జన్మదినాన్ని పురస్కరించుకొని, కొడంగల్‌లోని ఆయన నివాసానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాధు ప్రతాప్ రెడ్డి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సాధు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజా పాలన పేరుతో ప్రజలకు సేవలందిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని వారికి సంక్షేమ ఫలాలను అందించడంలో ముందుందని అన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి నిత్యం ప్రజాసేవలో ఉంటూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని వేడుకున్నట్లు సాధు ప్రతాప్ రెడ్డి తెలిపారు.



త్రాగునీటిలో మురికి నీరు... అనారోగ్యబారిన పడుతున్న స్థానిక ప్రజలు

వాటర్ బోర్డు డీజీఎమ్ త్రినాథరావు ని కలిసి సమస్యలు వివరించిన జనసేన నాయకులు కొల్లా శంకర్

కూకట్ పల్లి, నవంబర్ 10 (ప్రభాత ఉదయం)

కూకట్ పల్లి నియోజకవర్గం, కేపీహెబి 4వ ఫేస్ గత కొన్ని నెలలుగా వేధిస్తున్న తాగునీటి సమస్యపై ఎల్ఐజి కాలనీవాసులు జనసేన కూకట్ పల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ దృష్టికి వారి యొక్క త్రాగునీటి సమస్యను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ప్రేమకుమార్ సూచనలు మేరకు జనసేన పార్టీ కూకట్ పల్లి కోఆర్డినేటర్ కొల్లాశంకర్ మంగళవారం తాగునీటి సమస్యపై స్థానిక ప్రజలతో కలిసి వాటర్ బోర్డు డీజీఎమ్ త్రినాథరావు ని కలిశారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను జనసేన నాయకులు కొల్లా శంకర్ వివరిస్తూ తాగునీటిలో మురుగునీరు కలవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారాని, నీటి సరఫరా ప్రారంభమైన 30 నిమిషాల్లో మొదటి 10 నిమిషాలు కలుషితమైన మురికినీరే వస్తోందని, ఆ తర్వాతే మంచి నీరు వస్తుందని, స్థానిక ప్రజలు అనారోగ్యానికి పాల్పడుతున్నారని, ప్రజల ఆరోగ్యం పై దృష్టి సారించాలని ఈ సమస్యపై తగిన చర్యలు తీసుకోవాలని త్రినాథరావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ తీవ్రమైన సమస్యపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయనను కోరారు. జనసేన నాయకులు తెలిపిన సమస్యపై త్రినాథరావు తక్షణమే సానుకూలంగా స్పందించారు. నెల రోజుల్లోగా ఈ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అదే విధంగా, స్థానిక ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని, తాగునీటిని వృథా చేయవద్దని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆళ్ల నరేంద్ర, పుప్పాల అంజి, దాసరి వెంకట్, కాలనీ మహిళలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకుడు రవికుమార్ యాదవ్...

మియాపూర్ ప్రభుత్వ భూములు ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలి!

మిగిలిన 400 ఎకరాల్లో ఆసుపత్రి, విద్యాసంస్థలు, పార్కులు నిర్మించాలి

ప్రభుత్వ భూములను విక్రయిస్తే ఊరుకునేది లేదు.. పేదల ఇళ్ల జోలికొస్తే తీవ్ర పరిణామాలు: బీజేపీ నేత రవికుమార్ యాదవ్ హెచ్చరిక

శేరిలింగంపల్లి : నవంబర్ 10, (ప్రభాత ఉదయం)

ప్రజా ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వమే వాటిని విక్రయించేందుకు ప్రయత్నించడం దుర్మార్గమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవికుమార్ యాదవ్ మండిపడ్డారు. మియాపూర్ సర్వే నంబర్లు 100, 101లోని 550 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలని, కాలనీలను మినహాయించి మిగిలిన సుమారు 400 ఎకరాల్లో ఆసుపత్రి, ప్రభుత్వ కళాశాలలు, పార్కులు, నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ భూములను విక్రయించే నిర్ణయం ప్రకటించిన నేపథ్యంలో రవికుమార్ యాదవ్ మియాపూర్‌లోని ఎం.ఏ. నగర్ కాలనీని క్షేత్రస్థాయిలో సందర్శించారు. అక్కడ నివాసముంటూ ఇళ్లు కోల్పోయే పరిస్థితిని ఎదుర్కొంటున్న బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మియాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 100లో 277 ఎకరాల 5 గుంటలు, సర్వే నంబర్ 101లో 273 ఎకరాల 34 గుంటలు కలిపి మొత్తం సుమారు 550 ఎకరాల 39 గుంటల భూమి ఉందన్నారు. 1912 నాటి సర్వే రికార్డుల నుంచే ఈ భూములు ప్రభుత్వ భూములుగా నమోదయ్యాయని, 1949లో జాగీర్ల రద్దుతో పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చాయని వివరించారు. ప్రైవేటు వ్యక్తుల వాదనలను తోసిపుచ్చుతూ 2003లోనే హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చిందని, తాజాగా సుప్రీంకోర్టు తుది తీర్పుతో ఈ భూములపై న్యాయపరమైన వివాదానికి తెరపడిందని పేర్కొన్నారు.ప్రభుత్వానికి చెందిన వేల కోట్ల రూపాయల విలువైన భూములను ప్రజా అవసరాలకు వినియోగించకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసం విక్రయించాలని చూడటం సమంజసం కాదన్నారు. ఇప్పటికే సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో ఎం.ఏ. నగర్, స్టాలిన్ నగర్ వంటి కాలనీలు ఏర్పడి పేద కుటుంబాలు నివసిస్తున్నాయని, మిగిలిన 400 ఎకరాలను ప్రజా అవసరాలకు కేటాయించాలని సూచించారు. ఈ భూముల్లో అన్ని సౌకర్యాలతో కూడిన పెద్ద ప్రభుత్వ ఆసుపత్రి, డిగ్రీ లేదా ఇంజనీరింగ్ కళాశాల, విశాలమైన పార్కులు, నిరుపేదలకు పక్కా గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఓట్లతో గెలిచిన స్థానిక ఎమ్మెల్యేకు ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలపై చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ భూముల విక్రయాన్ని అడ్డుకోవాలని సవాల్ విసిరారు. సొంత నియోజకవర్గంలోని విలువైన ప్రభుత్వ భూముల విషయంలో మౌనంగా ఉండటం తగదని విమర్శించారు. శేరిలింగంపల్లి ప్రజలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునేది లేదని, తరతరాలుగా గుడిసెలు, ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేదల జోలికి వస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ప్రజల భూములను కాపాడేందుకు అవసరమైతే జైలుకు వెళ్లడానికైనా సిద్ధమని స్థానికులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే శేరిలింగంపల్లి నుంచే పోరాటం ప్రారంభించి, బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాణిక్ రావు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు విజయేందర్, డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్, శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సీతారామ రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గణేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు రాఘవేంద్ర రావు, నాగేశ్వర్ గౌడ్, సమ్మెట ప్రసాద్, మహేష్ యాదవ్, రాజేష్ గౌడ్, రాము, ప్రకాష్, ప్రవీణ్ తదితరులు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కామని వనిత

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్, 10(ప్రభాత ఉదయం):



కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా కామని వనిత కు అధిష్టానం మళ్లీ బాధ్యతలను అప్పగించింది. పార్టీ బోలోపేతానికి రాజన్న సిరిసిల్ల జిల్లాలో కృషి చేస్తున్న ఆమెకు ముచ్చటగా మూడవసారి బాధ్యతలను అప్పగిస్తూ అధిష్టానం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నాపై నమ్మకం ఉంచి మరోసారి అవకాశం కల్పించిన అఖిల భారత మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లంబా, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణక్కలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి అడుగులోనూ తనకు అండగా నిలుస్తూ, సహాయ సహకారాలు అందిస్తున్న వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందరన్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీను, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, మహిళా కాంగ్రెస్ కుటుంబ సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




కన్నుల పండువగా పాగుంట వెంకన్న రథోత్సవం

వేలాదిగా తరలివచ్చిన భక్త జనసందోహం

రథోత్సవం ప్రారంభించిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 10(ప్రభాత ఉదయం)



అశేష జనవాహిన మధ్య పాగుంట వెంకటేశ్వర స్వామి రథోత్సవం కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. భక్తుల కోరికలు తీర్చే వెంకన్నగా విరాజిల్లుతున్న కేటిదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన స్వామి వారి రథోత్సవం మంగళవారం రాత్రి అంగరంగా వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు హోమాలు చేశారు. సాయంత్రం శ్రీవారిని పల్లకిలో ఆలయం చుట్టూ ఊరేగింపుగా నిర్వహించి, అనంతరం రథోత్సవం పై ఆసీనులు చేశారు. అశేష జన వాహిన మధ్య పాగుంట వెంకటేశ్వర స్వామి రథోత్సవం, అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాల్లో ముఖ్యఘట్టమైన రథోత్సవానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. రథోత్సవం సందర్భంగా జాతర ప్రాంగణం భక్త జనసందోహంతో కిక్కిరిసిపో యింది. తేరును లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. వేలాది భక్త జనసందోహం మధ్య రథచక్రాలు కదిలాయి. ఆ ప్రాంతమంతా గోవింద నామస్మరణతో మారుమోగింది. దేవస్థానం ముఖ ద్వారం నుంచి గ్రామంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వరకు భక్తులు రథాన్ని లాగి తరువాత రథాన్ని తిరిగి యథాస్థానం వరకు లాగారు. వివిధ ప్రాం తాల నుంచి వేలాదిగా భక్తులు తరలి రావడంతో జాతర ప్రాంగణం కిక్కి రిసింది. భక్తులతో తినుబండారాలు, గాజులు, చెరుకు గడల దుకా ణాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల సీఐ టి.శ్రీను ఆధ్వర్యంలో పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.



ప్రగతి నగర్ వన్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చొరవ

రూ.18.70 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

సమస్య రహిత కాలనీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

కూకట్ పల్లి, నవంబర్ 10 (ప్రభాత ఉదయం)

శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని ప్రగతి నగర్ 1 కాలనీలో రూ.18 లక్షల 70 వేల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) పైప్ లైన్ నిర్మాణం పనులకు, మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు జలమండలి అధికారులు, ప్రగతి నగర్ 1 వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పి ఎస్ సి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మెరకు మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవ తో మంగళవారం ప్రగతి నగర్ కాలనీలో రూ. 18 లక్షల 70 వేల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) పైప్ లైన్ నిర్మాణం పనులకు, మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని తెలియచేసారు. అత్యవసరం ఉన్న చోట, నిత్యం పొంగుతున్న ప్రాంతలలోప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామని అన్నారు. ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామని, కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లు గా తీర్చిదిద్దడమే లక్ష్యం అని అన్నారు. కాలనీలలో గల ఎన్నో ఏండ్ల సమస్య నేటి తో తిరునని, నిత్యం పొంగుతుండటం వలన కాలనీ వాసులు ,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని దృష్టిలో పెట్టుకొని నూతన పైపు నిర్మాణం శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు.ప్రతి కాలనీ లో స్వచ్ఛమైన మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం చేపట్టడం ద్వారా కాలనీ వాసులకు, ప్రజలకు, స్వచ్ఛమైన మంచి నీరు అందుతుందని అన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, యూజీడీ పైప్ లైన్, మంచి నీటి పైప్ లైన్ వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని, ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని హామీ ఇచ్చారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అధికారులకు సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ,నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, అదేవిధంగా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. సంతోష్, జనరల్ మేనేజర్ హరిశంకర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.వి.ఎన్. శ్రీనివాస రాజు, మేనేజర్ ఆర్. అనిల్ కుమార్, నాయినేని చంద్రకాంతరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందుల శివకుమార్, ప్రగతి నగర్ 1 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచర్ల విష్ణు, ప్రధాన కార్యదర్శి రఘుగౌడ్, కోశాధికారి ఎస్ శంకర్ రావు, ఎల్లం నాయుడు, శ్రీరాముల వెంకటేష్, వాణి, అనిత తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అసోసియేషన్ సభ్యులు, స్థానిక వాసులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608